నేటి దినపత్రిక
# సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం | 27 ఏప్రిల్ 2025 | పేజీలు 8

**ఎస్పీ కృష్ణకాంత్**

ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో సైబర్ నేరాలకు పాల్పడే ముఠాను నెల్లూరు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో వారిని అరెస్టు చేశారు. ప్రపంచంలో ఎవరికైనా ఏమీ ఊరికినే రావు ఎవరూ ఊరికే ఇవ్వరు అనే విషయం గ్రహించి, అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

వివరాలు 2లో

ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో.. సైబర్ నేరాలకు పాల్పడే

# ముఠా అరెస్ట్



సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీతో

## మంత్రి ఆనం సమీక్ష



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆత్మకూరు పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కలెక్టర్, ఎస్పీలకు సూచించారు. శనివారం ఉదయం కలెక్టరు క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఆత్మకూరు పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌తో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. మే నెల 1న సీఎం పర్యటన రూట్‌మ్యాప్, కార్యక్రమాల వివరాలు, బందోబస్తు తదితర అంశాలను ప్రధానంగా చర్చించారు. ఆత్మకూరులో బీసీ రెసిడెన్షియల్ హాస్టల్ వద్ద హెలీప్యాడ్, నారంపేటలో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవం, పైలాన్ ఏర్పాటు, మేడే సందర్భంగా నారంపేట ఎంఎస్ఎంఈ పార్కు వద్ద ఆటో కార్మికులు, గృహ నిర్మాణ కార్మికులు, ఇతర కార్మికులతో ముఖాముఖి, నెల్లూరుపాలెం ఎస్టీ కాలనీలో పింఛన్ల పంపిణీ, -మిగతా 2లో

- రాజధాని అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు రావాలి
- సీఎం సూచనలతో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేస్తాం
- రానున్న మూడేళ్లలో రాజధానిని పూర్తి చేస్తాం
- అంబేద్కర్ పార్కును చిన్నారులతో కలిసి ప్రారంభించిన మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



రాష్ట్రాన్ని అన్నివిధాలా

## అభివృద్ధి చేస్తాం

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు నగరంలోని 9వ డివిజన్ పరిధిలో, రాయపాలెం అంబేద్కర్ పార్కును రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్థానిక చిన్నారుతో రిబ్బన్ కట్ చేసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ దామవరపు రాజశేఖర్ డివిజన్ ఇంచార్జ్ కువారపు బాలాజీ స్థానిక ముఖ్య నాయకులు మంత్రి నారాయణకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన ఆట వస్తువులను పరిశీలించి చిన్నారులతో కాసేపు ఆటలాడారు. వేసవి సెలవుల్లో పిల్లలందరూ పార్కులో చక్కగా ఆడుకోవాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. 9వ డివిజన్లో పార్కు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. పార్కులో చిన్నారుల కోసం అధునాతన ఆట వస్తువులను ఏర్పాటు చేశారన్నారు. 2014లో తాను మంత్రిగా ఉన్నప్పుడు 103 మున్సిపాలిటీలలో పార్కుల అభివృద్ధితోపాటు సెంట్రల్ డివైడర్లను ఏర్పాటు దేశమని గుర్తు చేశారు. గత ప్రభుత్వం పార్కులను సరిగ్గా మెయింటైన్ చేయక తుప్పు పట్టి మూలనపడ్డాయన్నారు. నెల్లూరు నగరంలో మొత్తం 46 పార్కుల్లో మాస్టర్ ప్లాన్‌తో జిమ్ ఎక్విప్మెంట్ ఏర్పాటు చేశామని, ఈనెల 23 నుండి పిల్లలకు వేసవి సెలవులు ఉన్నందున పార్కులను సిద్ధం చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. అలాగే నగరంలోని 54 పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురానున్నామని ఆయన తెలిపారు. గతంలో నిలిచిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వాటర్ ప్రాజెక్టులను వచ్చే నెల 15లోగా ప్రారంభించి పూర్తి చేస్తామని తెలియజేశారు. నెల్లూరు నగరంలో 2లో

## ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

- ప్రజా సమస్యల పరిష్కారం కోసం మనమిత్ర యాప్
- మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోండి
- నెల్లూరును స్మార్ట్ సిటీగా చేయడమే లక్ష్యం
- మంత్రి నారాయణ వెల్లడి



7లో

## నేడు ఆత్మీయ సమావేశం, ట్రై సైకిళ్ల పంపిణీ




2లో

మత్స్యకారుల జీవనోపాధి కల్పించడమే..

## ప్రభుత్వ లక్ష్యం



- జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు
- 12,239 మంది మత్స్యకారులకు రూ.24.47 కోట్లు జమ




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

జిల్లాలో 'మత్స్యకార సేవలో' పథకం ద్వారా 12,239 మంది మత్స్యకారులకు రూ.24.47 కోట్లు నగదును వారి బ్యాంకు ఖాతాలకు ముఖ్యమంత్రి జమ చేసినట్లు జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం బీచ్ నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'మత్స్యకార సేవలో' పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి మత్స్యశాఖ అధికారులు, మత్స్యకార సంఘ నేతలు, మత్స్యకారులు వర్చువల్‌గా వీక్షించారు. -మిగతా 2లో

# ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో సైబర్ నేరాలకు పాల్పడే ముఠా అరెస్ట్

### జిల్లా ఎస్పీ కృష్ణకాంత్




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో సైబర్ నేరాలకు పాల్పడే ముఠాను నెల్లూరు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో వారిని అరెస్టు చేశారు. శనివారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎవరికైనా ఏమీ ఊరికినే రావు ఎవరూ ఊరికే ఇవ్వరు అనే విషయం గ్రహించి, అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇన్వెస్ట్మెంట్ పేరుతో అదనపు ఆదాయం ఆర్జించమంటూ ఆశ చూపి, ఆన్‌లైన్‌లో నగదు పెడితే 10 నుండి 15 శాతం ఆదాయం సంపాదించవచ్చని, ట్రేడింగ్ చేసే వారినే లక్ష్యంగా చేసుకొని కొత్త పంథాలో నేరాలకు సైబర్ నేరగాళ్లు పాల్పడుతున్నారని సూచించారు. తక్కువ సమయంలో సులువుగా ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశను సైబర్ నేరగాళ్లు అస్త్రంగా ఎంచుకుంటున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్లు రూపొందించిన వెబ్ సైట్ లలో కొంత అమౌంట్ పెట్టక లాభాలు వస్తున్నట్లు ఎర వేసి, అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టించి, ఆ నగదు అకౌంట్‌లో కనబడతాయి కానీ మీ ఖాతాలో జమకావన్నారు. అమాయక ప్రజలే లక్ష్యంగా వల వేస్తున్న ముద్దాయిలు దోచేస్తున్న సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. జల్సాలకు అలవాటుపడి నగదు కోసం ముఠాగా ఏర్పడి సైబర్ నేరానికి పాల్పడుతున్న ముద్దాయిలందరూ యువతే లక్ష్యంగా చేసుకున్నారని పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును చేపట్టగా తీగ లాగితే డొంక కదిలినట్లు చిన్న బజార్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూపి లాగి జల్లెడ పట్టి ముద్దాయిలను అరెస్టు చేసినట్లు చెప్పారు. నకిలీ ఆధార్, పాన్‌కార్డులను సృష్టించి, బ్యాంక్ అకౌంట్‌లను ఓపెన్ చేసి, సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. బయోమెట్రిక్ ధృవీకరణ అవసరం లేని రోడ్‌సైడ్ సేల్ పాయింట్ల నుండి డీ-కేవైసీ ద్వారా సిమ్ కార్డులను పొంది దాని ద్వారా అకౌంట్‌కు సిమ్ కార్డును లింక్ చేసి అమాయకుల సొమ్మును దోచుకుంటున్నారు.

#### 7 మంది ముద్దాయిలు అరెస్ట్..

సుమారు రూ.2.46 కోట్లు బాధితుల నగదు కాజేసినట్లు ఇప్పటి వరకు చేసిన దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు వెల్లడించారు. నిందితుల పేరు మీద ఉన్న బ్యాంక్ అకౌంట్స్ ఫ్రీజ్ చేసి రూ.39లక్షల 40 వేల నగదు హోల్డ్ చేయమని బ్యాంక్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వెంటనే నిర్భయంగా వచ్చి పోలీసు వారిని ఆశ్రయించాలని, ఆందోళన చెందకుండా సకాలంలో స్పందిస్తే పూర్తి న్యాయం జరుగుతుందన్నారు. మోసం జరిగిన వెంటనే హెచ్‌టీటీపీ://సైబర్‌క్రైం డాట్ గోవ్ డాట్ ఇన్‌కు 1930 లేదా దగ్గరలోని పోలీస్ వారికి ఫిర్యాదు చేయాలని కోరారు. అనంతరం చిన్నబజార్, సైబర్ పోలీసు సిబ్బంది, అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌజన్య, టౌన్ డీస్పీ సింధు ప్రియా, చిన్నబజార్ సీఐ చిట్టెం కోటేశ్వరరావు, సైబర్‌క్రైమ్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ముద్దాయిలను ఈనెల 25వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు, సౌత్ నెల్లూరు రైల్వే స్టేషన్ వద్ద అరెస్ట్ చేసినట్లు చెప్పారు. సమావేశంలో నెల్లూరు జిల్లా అడిషనల్ ఎస్పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం



(మొదటి పేజీ తరువాయి)

ఎన్టీఆర్ సుజల స్రవంతి కోసం గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో ఆరు చోట్ల వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని, గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మా మీద కోపంతో వాటి ఆలనా పాలన పట్టించుకోకపోవడంతో అవి పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. తిరిగి వాటి అన్నిటిని పునరుద్ధరించి ప్రజలకు కేవలం రెండు రూపాయలకే 20 లీటర్ల సురక్షిత తాగునీరుని అందిస్తున్నామని మంత్రి చెప్పారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం 2014-19లో 34 వేల ఎకరాలు ఇవ్వడం జరిగిందని, 64 వేల కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. రాజధాని నిర్మాణాన్ని మరో మూడు సంవత్సరాలు పూర్తి చేస్తామన్న మంత్రి ప్రజాభిప్రాయంతో అభివృద్ధికి శ్రీకారం చుట్టుతున్నామని తెలియజేశారు. రాజధాని పరిసర ప్రాంతాల్లో భూముల విలువ పెరగాలంటే పరిశ్రమలు రావాలని, అందుకోసం ముఖ్యంగా ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ ఏర్పాటు చేసే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చర్యలు చేపడుతున్నామన్నారు. రానున్న 50 సంవత్సరాల దృష్టిలో ఉంచుకొని ఒక ఏర్పోర్ట్, స్పోర్ట్ సిటీని ఏర్పాటు చేయాలని అందుకు ఎనిమిది వేల ఎకరాల భూమి అవసరం అవుతుందని మంత్రి అన్నారు.అమరావతి నిర్మాణానికి మరికొంత భూమి అవసరం అవుతుందని, అందుకు ల్యాండ్ అక్విజేషన్ ల్యాండ్ పూలింగ్ విషయంలో భూ యజమానులతో చర్చిస్తున్నామన్నారు. గత వైసిపి హయాంలో రాష్ట్రాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారని, ఐదేళ్లలో పిచ్చి తుగ్లక్ పాలన సాగిందని, రాష్ట్రంలో నిర్వీర్యమైన వ్యవస్థలన్నింటినీ తిరిగి గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారని మంత్రి నారాయణ అన్నారు. గతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్ కోసం 5 వేల చెల్లించాల్సి ఉండగా, దానిని కేవలం ఒక్క రూపాయి తీసుకొని కనెక్షన్ ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించడం జరిగిందని నెల్లూరు ప్రజలకి మంత్రి నారాయణ శుభవార్త చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాజీ జెడ్పీటీసీ విజేత రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, కార్పొరేటర్లు టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆత్మీయ సమావేశం, ట్రై సైకిళ్ల పంపిణీ

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గంలో ఉన్న దివ్యాంగులకు భరోసానిస్తూ.. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ల అందజేత కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నియోజకవర్గవ్యాప్తంగా దాదాపు 160 మందికి ట్రై సైకిళ్లు అందించనుండగా.. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం జరగనుంది. అన్ని వసతులు కల్పించారు. ట్రై సైకిళ్ల అందజేతకు, ఆత్మీయ సమావేశానికి వేర్వేరుగా వేదికలు ఏర్పాటు చేశారు. ఆత్మీయ సమావేశానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీస్థాయిలో తరలిరానున్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీతో మంత్రి ఆనం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఆత్మకూరు ఏఎంసి గ్రౌండ్‌లో ప్రజావేదిక, పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాట్లపై మంత్రి ఆనం చర్చించారు. నారంపేటలోని ఎంఎస్‌ఎంఈ పార్కు పైలాన్ ఆవిష్కరణ, ప్రజావేదిక ఏర్పాట్లను ముఖ్యమంత్రి కార్యాలయ మార్గదర్శకాల మేరకు చేపట్టాలన్నారు. నెల్లూరుపాలెం ఎస్టీ కాలనీలో పెన్షన్‌ల పంపిణీ, యువతతో ముఖాముఖి ఏర్పాటు చేసే అంశాలను పరిశీలించాలన్నారు. శాఖలవారీగా నివేదికలు తయారు చేసి ముఖ్యమంత్రికి అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆత్మకూరు అభివృద్ధి, సమస్యలపై ఆయాశాఖల వారీగా సమగ్ర నివేదిక తయారు చేయాలని సూచించారు. శుక్రవారం రాత్రి నెల్లూరుపాలెం సమీపంలోని ఎస్టీ కాలనీని తాను సందర్శించానని, అక్కడ గిరిజనులు ఇళ్ల స్థలాలు లేవని, వర్షం వస్తే ఇల్లు ఊరుస్తున్నాయని, తమకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని, అక్కడే యువతతో కూడా తాను మాట్లాడానని, వారిలో చాలా మంది ఆటోడ్రైవర్లు, ట్రాక్టర్ డ్రైవర్లుగా, కూలీలుగా పనిచేస్తున్నారని, ఈ యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. సోమశిల జలాశయ మరమ్మతు పనులు, హైలెవల్ కెనాల్, తెలుగుగంగ పనులు, విక్రమసింహపురి యూనివర్శిటీ ద్వారా ఆత్మకూరులో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు, సంగం బ్యారేజీ నుంచి జాతీయ రహదారికి అను సంధానం చేయడం తదితర అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే విధంగా నివేదికలు రూపొందించాలని కోరారు. సీఎం పర్యటన నేపథ్యంలో హెలీప్యాడ్, డయాస్, బందోబస్తు, పార్కింగ్, రూట్‌మ్యాప్‌పై ఎస్పీతో మంత్రి ప్రత్యేకంగా చర్చించారు. నెల్లూరులో నూతన కలెక్టరేట్ భవనం ఏర్పాటు, అధునాతన అతిథిగృహం, ఆత్మకూరు బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, ఆదూరుపల్లి రెసిడెన్షియల్ పాఠశాలల ఇంటర్‌మీడియట్ వరకు అప్‌గ్రేడ్, సంగంలో ఐటీఐ ఈ ఏడాది నుంచే ప్రారంభం తదితర అంశాలు కూడా కలెక్టర్ మంత్రి మధ్య చర్చకు వచ్చాయి. గతంలో నెల్లూరులో అన్ని ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండాలని ప్రణాళిక రూపొందించామని, అయితే జిల్లాపరిషత్, ఎస్పీ కార్యాలయం, కార్పొరేషన్ కార్యాలయం తదితర భవనాలు నిర్మించగలిగామని, కలెక్టరేట్ మాత్రం మిగిలిపోయిందని, ఈ ప్రభుత్వంలో నూతన కలెక్టరేట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి సంబంధించిన ఒక నోట్‌ను అందించాలని కలెక్టర్‌ను మంత్రి ఆనం కోరారు.

## మత్స్యకారుల జీవనోపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)



ఈ సందర్భంగా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సముద్రంలో వేట సాగించే మత్స్యకారులకు వేట నిషేధ కాలం (ఏప్రిల్ 15 నుంచి 14 జూన్ వరకు) భృతి రూ.20వేలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేశారని చెప్పారు. రెండునెలల వేట నిషేధ కాలంలో మత్స్యకారుల జీవన విధానం దెబ్బతినకుండా వారికి ఆర్థిక భరోసా కల్పించాలన్నదే ఈ పథకం ప్రధాన ఉద్దేశంగా జెడీ చెప్పారు. జిల్లాలో సముద్ర తీర ప్రాంత నియోజకవర్గాలైన కావలి, కోవూరు, సర్వేపల్లి, కందుకూరు నియోజక వర్గాల్లో అర్హులైన మత్స్యకారులకు రూ.20 వేలు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్లు చెప్పారు. కావలిలో 4,778 మంది, కోవూరులో 3,102 మంది, సర్వేపల్లిలో 1,887 మంది, కందుకూరులో 2,472 మంది మత్స్యకారులకు వేట నిషేధకాల భృతి అందజేస్తున్నట్లు చెప్పారు. మత్స్యకార సంఘ నేతలు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గతంలో రూ.10వేలు ఇస్తున్న ఆర్థికసాయాన్ని రెట్టింపు చేసి రూ.20 వేలు అందిస్తున్న సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన మాట నిల బెట్టుకుని మత్స్యకారులకు అండగా నిలిచిన ముఖ్యమంత్రికి, రాష్ట్రప్రభుత్వానికి తమ మత్స్యకార కుటుంబాలు రుణపడి ఉంటాయని ఈ సందర్భంగా వారు తెలిపారు.

కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారులు చాన్‌బాషా, శ్రీనివాసులు, మత్స్యకార సంఘ నేతలు కొండూరు పాలిశెట్టి, పామంజి శేషయ్య, కొమారి విజయమ్మ, రామాని నారాయణ, భక్తాని శ్రీను, ఆవల వెంకటరమణ, మత్స్యకారులు పాల్గొన్నారు.

# వెలుగు, ఐసిడిఎస్ సంయుక్తంగా మండల సమాఖ్య సమావేశం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వెలుగు, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్త్రీ నిధి ఏజీఎం కామాక్షయ్య వెలుగు ఏపిఎం కృష్ణారావు స్త్రీనిధి అధ్యక్షురాలు మేరీ ఐసిడిఎస్ సిడిపిఓ పద్మజ కుమారి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు స్వయం సహాయక సభ్యులకు స్త్రీ నిధి ద్వారా అందే రుణాలు చెల్లించాల్సిన విధానాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. తమ జీవనోపాధిని పెంపొందించుకునేందుకు స్త్రీనిధి ద్వారా రుణాలను పొంది సకాలంలో చెల్లించి తమ జీవనోపాధిని పెంపొందించుకోవాలని తెలిపారు అలాగే సాధారణంగా జరిగే సమీక్ష సమావేశం ద్వారా వెలుగు అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. అనంతరం సిడిపిఓ పద్మజాకుమారి మాట్లాడుతూ.. ఫోక్సో చట్టం చైల్డ్ హెల్ప్ లైన్ ఉమెన్ చట్టాలు ఉమెన్ హెల్ప్ లైన్ బాల్య వివాహాలు నియంత్రణ చట్టం మరియు మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చట్టం గురించి కిషోర్ వికాసం గురించి తెలియజేశారు. అలాగే కిషోర్ వికాసం వేసవి ప్రత్యేక కార్యక్రమం మే రెండవ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు వారానికి రెండు రోజులు అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని తెలియజేశారు. బాల్యవివాహాలను అరికట్టుటకు తీసుకోవలసిన చర్యలను గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ ప్రెసిడెంట్ హరిత కార్యదర్శి మహేశ్వరి సీసీలు సునీత సుశీల విజయలక్ష్మి లక్ష్మి స్వయం సహాయక సభ్యులు తదితరులు ఉన్నారు.

# ప్రజా సమస్యలపై సీపీఎం గళం నిప్పుతోంది



## ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి : మూలం రమేష్

**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. శనివారం మండలంలోని సీపీఎం కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూల రమేష్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ప్రజా చైతన్య యాత్రలో అనేక ప్రజా సమస్యలు వెలువడ్డాయని, వాటికి ప్రభుత్వం ఇప్పటికీ పరిష్కార మార్గం చూపలేదని అన్నారు. ముఖ్యంగా మండలంలో గంగపట్నం పల్లిపాలెం బ్రిడ్జ్, ముదివర్తి, ముదివర్తిపాలెం కాజ్వే, పెన్న పొర్లు కట్ట రివిట్మెంట్ వాల్ పనులు ఇప్పటికీ అలానే ఉన్నాయి అన్నారు. ప్రజలు ఈ సమస్యలతో తీవ్రంగా ఇబ్బందులుపాలు అవుతున్నారన్నారు. ఎప్పటికప్పుడు ప్రజాసమస్యలపై సీపీఎం పార్టీ తమ గళం విప్పుతోందని, కానీ ప్రభుత్వంలో మాత్రం చలనం లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం వీటికి బడ్జెట్ కేటాయించి త్వరితగతిన పనులు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని గ్రామాల్లో స్మశాన స్థలాన్ని ఆక్రమించారని వాటిని వెంటనే ప్రభుత్వం స్వాధీనపరచుకోవాలన్నారు. మే 1వ తేదీన పుచ్చలపల్లి సుందరయ్య జయంతి వేడుకలు మండలంలో జరపాలని పిలుపునిచ్చారు. సుందరయ్య అడుగుజాడల్లో తామంతా నడుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియు అధ్యక్షులు టీవీవి ప్రసాద్, సీపీఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు, ప్రభాకర్ రెడ్డి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోస్టర్ పాయింట్‌లో అసమానతలు తొలగించండి

## పేరిపోగు వెంకటేశ్వర రావు మాదిగ



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఎస్సీ వర్గీకరణ విషయంలో రోస్టర్ పాయింట్‌లో ఏపీ ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరిపోగు వెంకటేశ్వర రావు మాదిగ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం రోస్టర్ విధానంలో అన్యాయం చేస్తుందని వివరించారు. నెల్లూరులోని బాబూ జగ్జీవన్ రామ్ భవన్ లో శనివారం ఎస్సీ వర్గీకరణ జేఏసీ నాయకులు పందిటి సుబ్బయ్య మాదిగ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్ల పోరాట ఫలితం నేడు ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం జరిగిందన్నారు. అయితే రోస్టర్ పాయింట్ల విధానంలో, వర్గీకరణ అసలే వద్దంటున్న మాలలకు 7.5శాతం కేటాయింపులు చేయడం సరికాదన్నారు. రెల్లి కులానికి 1శాతం, మాదిగలకు 7 శాతం, మాలలకు 7 శాతం ప్రకారం రోస్టర్‌లో సరిచేయాలని డిమాండ్ చేశారు. అలా రోస్టర్ పాయింట్‌లో సరిచేయకుండా, అమలు చేయడం ద్వారా మాదిగలు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. మాదిగలు 1శాతం ఉద్యోగావకాశాలు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగలకు రోస్టర్ పాయింట్లో అన్యాయం జరుగుతుంటే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ ఎలా అంగీకరిస్తారని ప్రశ్నించారు. మా డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించక పోతే మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ యునైటెడ్ ఫోరం నేతలు దేగ రవి రాఘవేంద్ర, విజయ్ కుమార్, మన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పల్లాల శ్రీనివాసులు, మాదిగ జేఏసీ నేతలు కొమ్మల కృష్ణయ్య, జనార్ధన్, ఆనందరావు, గడ్డం శేఖర్, రత్నయ్య, అంకయ్య, లక్ష్మయ్య, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్టు కుటుంబసభ్యులకు పరామర్శించిన ఆనం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** వీఆర్ కళాశాల మాజీ తెలుగు అధ్యాపకులు సుప్రసిద్ధ సాహితీవేత్తలు పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ ఇటీవల కాలంచేసిన నేపథ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం, 33వ డివిజన్, పొదలకూరురోడ్డు, నేతాజీనగర్ 4వ వీధిలోని మెట్టు రామచంద్రప్రసాద్ నివాసం నందు కుటుంబ సభ్యులను వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్ రావు, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మురళి యాదవ్, జగన్నాథం శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల హక్కు పత్రాలు పరిశీలన



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం రైతాంగానికి సంబంధించిన భూముల హక్కు పత్రాలను శనివారం రెవిన్యూ శాఖ అధికారులు గ్రామంలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం కృష్ణపట్నం గ్రామ పంచాయతీలో రీ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ప్రాథమిక దశలో భూముల డాక్యుమెంట్లను రైతులు ద్వారా పరిశీలించే కార్యక్రమాలు చేశారు. సర్వే బృందం అధికారులు ఉమాదేవి, పవన్, వెంకట రమణయ్య, సురేష్ తదితరులు రైతుల పత్రాలు పరిశీలిస్తూ అడంగల్ నందు సరిచూశారు. అనంతరం అధికారులు మాట్లాడారు. భూములు విస్తీర్ణం తోపాటు భూమి యజమాని, తదితర డాక్యుమెంట్లు పరిశీలించామన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో టీడీపీ సభ్యత్వ కార్డులను మర్రిపాడు మండల టీడీపీ అధ్యక్షులు ఆరికట్ల జనార్ధన్ నాయుడు భూత్ కన్వీనర్లకు శనివారం అందజేశారు. మొదటిగా శుక్రవారం మర్రిపాడు మండల కేంద్రంలో భూతుల వారీగా ఆయా భూత్ కన్వీనర్లకు అందించిన తర్వాత గ్రామాల్లో అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ శాఖమూరి నారాయణ, గాలిబోయిన లక్ష్మనరసయ్య, ఎలాగాల వెంకటేశ్వర్లు, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇప్పటినుండి నుండి ప్రతీ సభ్యులకు కార్డులను సభ్యులకు అందించనున్నారు.

# రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మైనార్టీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం అర్హులైన మైనార్టీ లబ్ధిదారుల నుంచి ఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి మైనార్టీ కార్పొరేషన్ ద్వారారుణాలు మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.



# చలివేంద్రాల జాడేది !

● మెట్ట ప్రాంతంలో తీరని దాహార్తి ● మండుటెండల్లో దాహం దాహం ● గాలికి వదిలేసిన నిబంధనలు

జిల్లాలో మండుటెండలు సుర్రుమంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు దాహార్తి తీర్చుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు చూస్తే అధిక డిగ్రీలతో తాండవిస్తోంది. ఫలితంగా చిన్నారులు, వృద్ధులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ప్రతి ఏడాది ప్రధాన సెంటర్లలో వేసవికాలం చలివేంద్రాలను ఏర్పాటు చేసే వాళ్ళు. ప్రస్తుత ఏడాది ఆ చలివేంద్రాల జాడే కనిపించకపోవడంతో పేద ప్రజలు దాహార్తి తీరకపోగా మండుటెండల్లో దాహం దాహం అంటూ ఆయాసపడుతూ నివాసాలకు పరుగులు తీస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో మార్చి నెల మొదలుకొని ఎండలు విపరీతంగా ఉంటున్నాయి. ప్రస్తుతం 30 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ తరుణంలో జిల్లాలోని ప్రజలు బయటకు వెళ్లాలంటే హడలెత్తిపోతున్నారు. గతంలో వేసవికాలం వచ్చేసరికి ప్రధాన కూడలిలోనూ, సెంటర్లలోనూ, వీధుల్లోనూ అధికారులు, పాలకులు, స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేసేవారు. దీంతో పేద మధ్య తరగతుల కుటుంబీకుల దాహార్తి తీరేది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారులు మార్చి, ఏప్రిల్, మే నెలలో చలివేంద్రాలు ఉండేటట్లు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఆ చలివేంద్రాల జాడే కనిపించకపోవడంతో ప్రజలు దాహార్తి తీర్చుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

## మెట్ట ప్రాంతంలో మరీ అధ్వాన్నం..

జిల్లాలోని మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలో ఉన్నటువంటి మండలాల్లో ప్రజలు చలివేంద్రాలు లేక పడరాని పాట్లు పడుతున్నారు. ఏదైనా పని అవసరం అయితే మండుటెండలోను బయటకు వెళ్లాల్సిన పరిస్థితి. అలాంటి తరుణంలో కొంతమంది వాటర్ బాటిల్ ద్వారా నీటిని తీసుకొని వెళుతుండగా మరి కొంతమంది ఆ అవసరం లేక ఇబ్బంది పడుతున్నారు. దీంతో దుకాణాల వద్దకు వెళ్లి రెండు నుంచి ఐదు రూపాయలు వెచ్చించి మంచి నీటిని కొనుగోలు చేసి దాహార్తిని తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మెట్ట ప్రాంతాలైన ఈ మండలాల్లో చలివేంద్రాలు ఎంతో ప్రాధాన్యతకు దోహదం ఇస్తాయి. ప్రస్తుతానికి ఉదయగిరి నియోజకవర్గ పరిధిలో వింజమూరు, వరికుంటపాడు, సీతారాంపురం మండలాల్లో కొన్ని స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇక మర్రిపాడు మండలాన్ని విషయం కొస్తే చలివేంద్రాల పూసే కనిపించడం లేదు. అసలే వర్షాధారం లేకపోవడంతో నివాసాల్లోని బోర్లు కూడా అడుగంటడంతో త్రాగునీటికి నిత్యవసరాలకు నీరు దొరకడం గగనం అయింది. దీంతో త్రాగు నీటిని ఆటోలో వచ్చేటటువంటి మినరల్ వాటర్ ను క్యాన్ సహాయంతో పది నుంచి 20 రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసి దాహార్తి తీర్చుకుంటున్నారు. ఇలా ప్రస్తుత ఏడాది చలివేంద్రాలు లేకపోవడంతో మెట్ట ప్రాంత ప్రజలు అల్లాడిపోతున్నారు. అందువలన అధికారులు, పాలకులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి రాబోయే మే నెల నాటికి చలివేంద్రాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్

### హాజరైన మూడు ప్రాజెక్టుల అగ్నిమాపక సిబ్బంది



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆ ప్రాజెక్టు నందు ఉమ్మడి మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని ప్రభుత్వ, ప్రైవేటు ప్రాజెక్టులకు సంబంధించిన అగ్నిమాపక సిబ్బంది. ఈ కార్యక్రమం నిర్వహించాయి. జాతీయ అగ్నిమాపక సేవ పక్షోత్సవాల సందర్భంగా ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ వేదికగా ఉమ్మడి అత్యవసర ప్రతి స్పందన డ్రిల్ జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థ అయిన ఏపీ జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రం, అదాని కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్, ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సంయుక్తంగా ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికతో చేపట్టడం జరిగింది. బొగ్గు ఫీడర్లలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణ కర్తవ్యంగా ఏ విధంగా స్పందించాలనే అంశంపై మాక్ డ్రిల్ ప్రదర్శించారు. ఆయా ప్రాజెక్టుల అగ్నిమాపక సిబ్బంది ఈ కార్యక్రమంలో విధులు నిర్వహించారు. ప్రమాదాలపై మొబైల్ సమాచారం అందిన వెంటనే ఎస్ఈఐఎల్ ఇండియా లిమిటెడ్, అదానీ కృష్ణపట్నం పోర్టు, ఏపీ జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రానికి సంబంధించిన అగ్నిమాపక సిబ్బంది ప్రమాదపు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సిబ్బంది ఫైర్ టెండర్లను ఉపయోగించి ఉమ్మడి అగ్నిమాపక చీరలు చేశారు. కార్యక్రమం ముగింపు దశలో వివరణాత్మక సెషన్ నిర్వహించబడింది. అగ్ని సురక్షిత భారత దేశం కోసం ఏకమవుదాం అనే నినాదంతో ఈ సంవత్సరం కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చేజర్లకు ఘన సన్మానం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర వైయస్సార్ సిపి స్టేట్ పబ్లిసిటీ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా నియమించబడిన చేజర్ల సుబ్బారెడ్డికు శనివారం అన్న పూర్ణ నగర్ తన నివాసంలో ఉదయగిరి మండల నాయకులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా చేజర్ల మాట్లాడుతూ.. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి నాపై నమ్మకంతో పదవి ఇచ్చారని 2029లో పార్టీ అధికారంలోకి వచ్చేదుకు కృషి చేస్తానన్నారు. పార్టీ పదవి రావడానికి కృషి చేసిన ఉదయగిరి నియోజకవర్గం సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డికి జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డికి పార్లమెంటు సమన్వయకర్త ఆదాల ప్రభాకర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గానుగ పెంట ఓబుల్ రెడ్డి, దాసరపల్లి సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, వెంగలరావు నగర్ సర్పంచ్ తిరుపతి, ఎంపిటిసి తిరుపతి, మాజీ మండల ఉపాధ్యక్షులు బాలిబోయిన శ్రీనివాసులు, అక్కి భాస్కర్ రెడ్డి, యు. గురవయ్య, యు.హరి, ఎండి రియాజ్, ఇత్తడి రమణ, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అల్పాహారం పంపిణీ



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ రామకృష్ణనగర్ శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం నందు శనివారం మిత్ర భారతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పమజుల సురేంద్ర సహకారంతో 200 మంది పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మిత్ర భారతి సభ్యులు జొన్నలగడ్డ రమేష్, మంచాల కోదండరామయ్య మాట్లాడుతూ.. పేదవారికి అల్పాహారం పంపిణీ చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. పేదవారికి ఆపన్న హస్తం అందించడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా అధ్యక్షులు కేకేరాజగోపాలచారి, సేవా రత్న గండికోట సుధీర్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి పూల మల్లికార్జున, వెంగయ్య, కిరణ్ పాల్గొన్నారు.

# ప్రతిష్ట మహోత్సవంలో.. అన్నదానం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని పాతూరు నందు వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలలో భాగంగా శనివారం గొప్ప అన్నదాన కార్యక్రమాన్ని జరిపించారు. శుక్రవారం ఉదయాన్నే అభిషేకాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించే సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం పెంచారు. రెండవరోజు శనివారం ఉదయాన్నే స్వామివారికి ప్రత్యేక అభిషేకంలో పూజా కార్యక్రమం జరిపించారు. తదుపరి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం గొప్ప అన్నదానం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని కనులారా దర్శించి తీర్థ ప్రసాదములను స్వీకరించారు. స్వామివారికి తమకు తోచిన విధంగా నగదును విరాళంగా అందజేశారు. కార్యక్రమాలను స్వామివారి భక్త బృందం పర్యవేక్షించారు.

# ప్రత్యామ్నాయ పంటగా పెసర మినుము : పీడీ

**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** తోటపల్లి గూడూరు మండలం ఇస్కపాలెం ఈదురు గ్రామాలలో భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టి నమూనాల సేకరణ, వరికి ప్రత్యామ్నాయ పంటల గురించి అవగాహన



కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ మాట్లాడుతూ.. వరికి ప్రత్యామ్నాయంగా పెసర మినుము సాగు చేసుకోవచ్చని కూరగాయల పంటలుగా బెండ, చిక్కుడు, వంగ, సాగు చేసుకోవచ్చని వివరించారు. ఒక ఎకరా వరి పండించడానికి అవసరమయ్యే నీటితో నాలుగు నుంచి ఐదు ఎకరాలలో కూరగాయలను పండించవచ్చని మూడు నుంచి నాలుగు ఎకరాలలో మినుము, పెసర పండించుకోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ కాల వ్యవధిలో తక్కువ ఖర్చుతో అధిక దగుబడినిచ్చే ప్రత్యామ్నాయ పంటలపై రైతులు మక్కువ చూపాలని తెలిపారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ఏ రాజ్ కుమార్ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆవశ్యకత గురించి వివరించారు. విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడకుండా ఖర్చు తగ్గించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి శిరీష రాణి విఏఏలు షర్మిల శివకుమార్ విద్యాసాగర్ వినీల్ శశి డయానా, రైతులు పాల్గొన్నారు.

### వీఆర్ హైస్కూల్‌ను రాష్ట్రంలోనే..

# నెంబర్ వన్ మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతాం

### మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు వీఆర్ హైస్కూల్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ శనివారం పరిశీలించారు. వీఆర్ హైస్కూల్‌లో చేపట్టాల్సిన, చేపట్టిన పనులపై మంత్రి క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తాను ఇదే హైస్కూల్‌లో చదివిన అను భూతిని హర్షం వ్యక్తం చేస్తూ తెలియజేశారు. అనంతరం మున్సిపల్ జూనియర్ కాలేజీలో స్కిల్ డెవలప్ మెంట్‌లో శిక్షణ పొందున్న విద్యార్థినుల కు మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థినీలతో శిక్షణ పొందిన విధానాన్ని మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ.. హైస్కూల్ నుంచి డిగ్రీ వరకూ తన విద్యాభ్యాసం వీఆర్సీలోనే సాగిందని తెలి పారు. విద్యా విధానానికి ఆదర్శప్రాయంగా వీఆర్ విద్యాసంస్థలు కొనసాగాయన్నారు. అయితే 6000 విద్యార్థులు ఉన్న వీఆర్ హైస్కూల్‌ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. కానీ తాను ఎన్నికల సమయంలో వీఆర్ హైస్కూల్ ని పునః ప్రారంభిస్తానని ఇచ్చిన హామీకి కట్టుబడి ఆ దిశగా శెరవేగంగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. వైసీపీ హయాంలో మూసేవేసిన వీఆర్ హైస్కూల్ ను ఆధునీకరిస్తున్నామన్నారు. వీఆర్ హైస్కూల్‌ను రాష్ట్రంలోనే నెంబర్ వన్ మోడల్ స్కూల్ గా తీర్చి దిద్దుతామని మాటిచ్చారు. దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న పేద పిల్లలకు మాత్రమే వీఆర్ హైస్కూల్‌లో ఆడ్మిషన్ కల్పిస్తామని చెప్పారు. ట్రాన్స్‌పోర్ట్ తో సహా విద్యకు సంబంధించి సకల సదుపాయాలు కల్పిస్తామని మంత్రి తెలియజేశారు. అదేవిధంగా విద్యార్థులకు ఉచిత భోజన వసతి కూడా ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ విద్యాభివృద్ధికి సంపూర్ణ మద్దతు ఇచ్చారని మంత్రి నారాయణ తెలిపారు. మరో నెలరోజుల్లో అన్నీ వసతులతో వీఆర్ హైస్కూల్‌ను అందుబాటులోకి తెస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలియజేశారు.

## ఘనంగా ఆశ్రిత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా విద్యార్థి విభాగం నాయకుల ఆధ్వర్యంలో శనివారం నెల్లూరులోని మాగుంట లేఔట్‌లో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరిగాయి. రూరల్ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు రోహిత్ రెడ్డి, రవి చంద్ర, ప్రేమ్ కుమార్ రెడ్డి, శరత్, కిట్టు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## బాల్య వివాహాలు, ఫోక్సో చట్టంపై అవగాహన



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండల సమాఖ్య కార్యాలయంలో శని వారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్త్రీ, శిశు సంరక్షణ సాధికారిత అధికారుల ఆదేశాల మేరకు బాల్య వివాహాలు, పోక్సో చట్టం పైన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు, అంగన్వాడి కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో నాగమణి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికా రులు హాజరయ్యారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ మాట్లా డారు. నూతనంగా బాలల చట్టాలలో వచ్చిన మార్పులు, శిక్షలు గురించి తెలియజేస్తూ చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181, 112 సైబర్ క్రైమ్, చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ యాక్ట్ గురించి వివరించారు. అక్షయ తృతీయ సందర్భంగా బాల్య వివాహాలు ఎక్కువగా దేవాలయాల్లో నిర్వహించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగే అవకా శాలు ఉన్నట్లయితే తెలుసుకొని సమాచారం ఇవ్వాలని అన్నారు. బాల్య వివాహాలు జరిపించిన వారిపై ఎటువంటి చట్టాలు వర్తింపజేస్తారు. వారికి పడే శిక్షలు గురించి జరిమానాల గురించి వివరించడం జరిగింది. లైంగిక వేధింపుల నుండి ఏ విధంగా రక్షణ కలిగించుకోవాలి. పోక్సో చట్టం గురించి తెలియజేస్తూ గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి అందరికి అవ గాహన కల్పించడం జరిగింది. మిషన్ వస్త్వల్య పథకం ద్వారా వచ్చే ఆర్థిక సాయం నాలుగు వేల రూపాయలు నిస్సహాయ స్థితిలో ఉన్న బాలలకు వైద్యం విజ్ఞుకు ఏవిధంగా ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం నిర్మల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రదాడిపై ఉవ్వేత్తు నిరసన, ర్యాలీ : వైసీపీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కాశ్మీర్‌లోని పెహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా ఆత్మకూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ఆదేశాల మేరకుశుక్రవారం ఆత్మకూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన ప్రదర్శన, ఉగ్రవాదుల దాడిలోమృతి చెందిన వారి ఆత్మ శాంతికి కొవ్వొత్తులతో నివాళి కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా సాగారు. బీయస్ఆర్ సెంటర్ కు చేరుకుని అనంతరం అక్కడ మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఈ దాడి ఒక చీకటి రోజుగా నిలిచిపోతుందన్నారు. ఇలాంటి దాడులతో భారతీయ స్ఫూర్తిని చెదరగొట్టలేరన్నారు. ఆనందంగా గడుపుతున్న పర్యాటకులపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపి 28 మందిని పొట్టన పెట్టుకున్నారని, ఉగ్రవాదానికి కుల మతాలతో పనిలేదన్నారు. కాశ్మీర్ లో ప్రశాంతంత నెలకొందని ప్రజలు భావిస్తున్న సమయంలో అనేక మంది అమాయక పౌరులను కాల్చి చంపడం దారుయమన్నారు. కేంద్ర ప్రభుత్వం భద్రతా సౌకర్యాలను మరింత మెరుగుపరచడం ద్వారా రక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, పట్టణ వైసీపీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్ రెడ్డి, పలువురు వైసీపీ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వేదగిరి క్షేత్రం పై బ్రహ్మోత్సవాల సమీక్ష



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం లోని నరసింహకొండపై వేంచేసియున్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం నందు మే 6 నుండి మే 16 వరకు జరుగబోవు శ్రీ స్వామి వారి బ్రహ్మో త్సవముల సందర్భంగా శనివారం బ్రహ్మోత్సవాల సమీక్ష – సమన్వయ కమిటి సమావేశం (కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ దేవస్థానం కార్యాలయం వద్ద తెలుగు దేశం రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నెల్లూరు ఆర్‌డీఓ అనూష, ఉత్సవ కమిటి చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి ఆధ్యక్షతన, ఆలయ కార్యనిర్వ హణాధికారి వేమూరి గోపి ఆద్వర్యంలో జరిగినది. ముందుగా నెల్లూరు ఆర్‌డీఓ అనూష వివిధ శాఖలు అనగా దేవదాయశాఖ, గ్రామ పంచాయతీ, పోలీసు శాఖ, విద్యుత్ శాఖ, రోడ్డు భవనాల శాఖ, అగ్నిమాపక శాఖ, ఆరోగ్య శాఖ, ఎపీఎస్ ఆర్టీసీ వారు, రూరల్ వాటర్ శాఖ, నీటి పారుదల శాఖ, సమాచార శాఖ, తదితర శాఖల వారితో శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తులకు సౌకర్య వంతంగా, విజయవంతంగా నిర్వహిం చుటకు తగు సూచనలు సలహాలు, ఆదేశాలు జారీ చేయడం జరిగింది. సమావేశంలో వివిధ శాఖల అధి కారులతో చర్చించి వారు తీసుకోబొయే చర్యలు గురించి చర్చించారు. తదుపరి దేవస్థాన కార్యనిర్వహ ణాధికారి వేమూరి గోపి మాట్లాడుతూ.. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులు సౌకర్యార్థం చలువ పందిర్లు వేయుట, క్యూ లైన్లు నిర్వహించుట, భక్తులకు తాగునీరు ఏర్పాటు చేయుట, కొండ పైన పరిశుభ్రత, విద్యుత్ దీపాలంకరణ, కల్యాణ ప్రాంగణం ఏర్పాటు, దేవస్థానం ఆధ్వర్యంలో ప్రసాదములు విక్రయము వివిధ ఆర్గనైజేషన్‌ల ద్వారా ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించ నున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. భక్తులకు శీఘ్ర దర్శనం వసతులు ఏర్పాటు చేసే విషయంలో పరిశుభ్రత కొరకు పంచాయతీ శాఖ వారు ప్రత్యేక బృందాలు గా ఏర్పడి కొండ పైన, ఏడు కోనేరుల వద్ద, కొండ దిగువ భాగం దేవరపాళెం పరిశు భ్రంగా ఉంచాలని సూచించారు. ఆర్టీసీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు బస్ స్టాండ్ పార్కింగ్ వగైరాలు చేయాలని, కండీషన్ లో ఉన్న బస్సులను మాత్రమే తిప్పాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం విద్యుత్ లైటింగ్ అన్ని ప్రదేశాల్లో ఉండేలా, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ వారికి తగు సూచనలు చేశారు. ముఖ్య పర్వదినం అయిన మే 10, 11, 12 తేదీలలో బ్రాంది షాపులు బెల్ట్ షాపులు నిర్వహించ కూడదు అని ఎక్సైజ్ శాఖ వారికి సూచించారు. భక్తుల సౌకర్యార్థం అవుట్ పోస్టు పోలీస్ స్టేషన్ విస్తృతంగా పోలీసు బందోబస్తు, దేవస్థానం క్యూ లైన్ల వద్ద పోలీస్ బందోబస్తు, రథోత్సవం నిర్వహణ కోసం బందోబస్తు, రోప్ పార్టీ ముఖ్యంగా వాహనాలు పార్కింగ్ నిర్వహణకు పోలీస్ శాఖ వారిని తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా అగ్ని మాపక వాహనాలను, ఏడు కోనేరుల వద్ద ప్రమాదాలు జరగకుండా గజ ఈత గాళ్ళని ఏర్పాటు చేయాలని అగ్ని మాపక శాఖ వారిని సూచించారు. భక్తుల ఆరోగ్యం కోసం తాత్కాలిక ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసి అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకుని అత్యవసర పరిస్థితులను ఎదుర్కోనుటకు అంబులెన్స్ ను ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖ వారిని సూచించారు. ఎప్పటికప్పుడు నీటి సరఫరా కొరకు రూరల్ వాటర్ వర్క్స్ వారిని తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాలు కొరకు నూతనంగా ప్రకటించిన ఉత్సవ కమిటీ సభ్యులను సంభందిత శాఖల అధికారులకు పరిచయం చేసారు. అన్ని శాఖల వారు దేవస్థాన కార్యనిర్వహణాధికారితో, ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డితో, ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయంతో ఎప్పటికప్పుడు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కొరకు సహాయ సహకారంలతో బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటి చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్ రెడ్డి, ఉత్సవ కమిటి సభ్యులు, రూరల్ సిఐ గుంజి వేణు, మాజీ చైర్మన్లు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, జిల్లా దేవదాయ శాఖ అధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి, పంచాయితి శాఖ అధికారులు, పొలిసు శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, ఆరోగ్య శాఖ అధికారులు, రోడ్లు రవాణ శాఖ అధికారులు, అగ్ని మాపక శాఖా అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, ఆరోగ్య శాఖ అధికారులు, రూరల్ వాటర్ వర్క్స్ అధికారులు, రెవెన్యూ ఇనిస్పెక్టర్, సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష కోట్లు విలువచేసే నీటి సంపద నిర్వహణకు

# నిధులను సిబ్బందిని కేటాయించాలి

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** లక్ష కోట్లు విలువచేసే ఇరిగేషన్ సిస్టం నిర్వహణకు నిధులను సిబ్బందిని కేటాయించాలని తెలుగు గంగ ఎస్ఈ రాధాకృష్ణారెడ్డికి బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. సోమశిల కండలేరు డ్యాములతోపాటు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 1720 చెరువులు 2200 పంట కాలువలు చిన్న కాలువలు లక్ష కోట్లు విలువ చేస్తాయి. నెల్లూరు జిల్లా ఇరిగేషన్ రంగంలో మెయింటెనెన్స్‌కు నిధులు లేని కారణంగా నీటి వృధా ఎక్కువగా జరుగుతుంది. సోమశిల కండలేరు వరద కాలువ 5.5 కిలోమీటర్ల వద్దనున్న రెగ్యులేటర్ గేట్లు సకాలంలో దిగకపోవడంతో రోడ్డు కొట్టుకుపోవడం పంట పొలాల్లోకి నీరు ప్రవహించడంను గుర్తు చేశారు. కండలేరులో లెవెల్ స్లూఇస్ గేటు దిగకపోవడంతో వాగు ద్వారానీటి వృధా జరిగింది. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేశారు. సోమశిల కండలేరు డ్యాములులో నిర్వహణకు సాంకేతిక సిబ్బంది లేరు. ఉన్న జలవనరుల వినియోగానికి రక్షణకు నియామకాలు లేవు. నెల్లూరు బ్యారేజీ వద్ద సామాగ్రినీ తిక్కన మందిరం పక్కన ఉంచారు. కనీసం వాచ్మెన్ కూడా లేకపోవడంతో ఐరన్ మెటీరియల్ దొంగలు ఎత్తుకు పోతున్నారు. ఏడాది క్రితం సామాగ్రి దొంగలింప బడినప్పుడు ఏఈ శ్రీకాంత్ రికవరీ చేశారు. సాగునీటి కాలువలు రెగ్యులేటర్లు తూములు నిర్వహణకు జిల్లాలో సిబ్బంది లేరు. 2021లో



సోమశిల డ్యామ్ ముందు భాగంలో దెబ్బతిన్న అప్రాన్ కు నిధులు లేవని పనులు నిలిపేశారు. సోమశిలకు వరద వస్తే చేసిన పనులు కూడా దెబ్బతింటాయి. సోమశిల కండలేరు కాలువ వైడనింగ్ పనులు నిధులు లేవని ఆపేశారు. నెల్లూరు జిల్లా ఇరిగేషన్ రంగంలో పెండింగ్ పనులు రాష్ట్ర ప్రయారిటీ జాబితాలో లేనట్లు ఉన్నాయి. నీటి వృధాను అరికట్టేందుకు లక్ష కోట్లు విలువ చేసే డ్యాములు చెరువులు పంట కాలువలు బికట్టడాలు నిర్వహణ కోసం నిధులను సిబ్బందిని నియమించాలని రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి నీలి శెట్టి లక్ష్మణరావు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ చూపిన హాస్టల్స్ టెన్త్ విద్యార్థులకు నగదుపారితోషికాలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు సహాయ సాంఘిక సంక్షేమాధికారి పరిధిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో ఉంటూ విద్యాభ్యాసం గావించి పదవతరగతి పరిక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు శనివారం జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యుటిడైరెక్టర్ కె.శోభారాణి చేతులమీదుగా నగదుపారితోషికాలను, ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. ఇటీవల టెన్త్ ఫలితాలు విడుదల కాగా ఆత్మకూరు ఏఎస్‌డబ్ల్యువో పరిధిలో అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థులకు అనంతసాగరం మండలం వెంగం పల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు విరాళంగా అందజేసిన నగదును అతిధిగా పాల్గొన్న డి.డి శోభారాణి చేతులమీదుగా పంపిణీ చేశారు. స్థానిక ఏఎస్‌డబ్యువో కె.బ్రాహ్మనందాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 565మార్కులు సాధించిన ఆత్మకూరు బాలురవసతిగృహ విద్యార్థి ఓ.సాయిధనుష్‌కు 5వేలరూపాయలు, 533మార్కులు సాధించిన రేవూరు హాస్టల్ విద్యార్థి ఓ.వెంకటేశ్వర్లుకు 3వేలరూపాయలు, 530 మార్కులు సాధించిన బుచ్చిరెడ్డిపాళెం బాలికలవసతిగృహం విద్యార్థిని కె.మానస, రేవూరు బాలుర వసతిగృహ విద్యార్థి బి.శివలకు 20వేల రూపాయల వంతున, 529మార్కులు సాధించిన బుచ్చి బాలికలవసతిగృహ విద్యార్థిని ఎం.త్రివేణి, రేవూరు హాస్టల్ విద్యార్థి ఎన్.ప్రవీణ్‌కుమార్, ఆత్మకూరు బాలురవసతిగృహ విద్యార్థి జె.నిషాంత్‌లకు ఒకవెయ్యి రూపాయల వంతున శోభారాణి అందజేశారు. నదగుతోపాటు ఆ విద్యార్థులకు ఎగ్జిక్యూటివ్‌ఫైల్స్‌ను కూడా ప్రోత్సాహక బహుమతులుగా అందజేశారు. ఆత్మకూరు పరిధిలో 63మంది పదవతరగతి విద్యార్థులు పరిక్షలకు హాజరుకాగా 52మంది ఉత్తీర్ణులయ్యారని, 7మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించారని, హాస్టల్స్ విద్యార్థుల్లో ఓ.సాయిధనుష్ 565మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచారని ఏఎస్‌డబ్ల్యువో బ్రహ్మానందాచారి పేర్కొన్నారు. ఈ విద్యార్థులందరినీ డి.డి శోభారాణి అబినందించి భవిష్యత్తులో కూడా పైతరగతుల్లో ఇంకా మంచి మార్కులు సాధించాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధి కారులు బి.పద్మనాభరెడ్డి, పి.సంగీత, కె.నిరంజన్, సనా, డి.శ్రీనివాసులు, పొదలకూరు ఏఎస్‌డబ్ల్యువో పరిధిలోని హాస్టల్‌వెల్ఫేర్ ఆఫీసర్లు, నాలుగవ తరగతి ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

- ప్రజా సమస్యల పరిష్కారం కోసం మనమిత్ర యాప్
- మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రజల సద్వినియోగం చేసుకోండి
- నెల్లూరును స్మార్ట్ సిటీగా చేయడమే లక్ష్యం
- మంత్రి పొంగూరు నారాయణ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ప్రజల సమస్యల పరిష్కారం కోసం మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చామని రాష్ట్ర పుర పాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారా యణ పేర్కొన్నారు. శనివారం స్థానిక గోమతి నగర్ మంత్రి క్యాంప్ కార్యాలయంలో అధికారు లు, కార్పొరేటర్లు, సచివాలయ సిబ్బంతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ.. 2014-19లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీలలో పాఠశా లలను పార్కులను సెంట్రల్ డివైడర్లను, 5వేల కోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి చేశామన్నారు. ప్రభుత్వం మారడంతో తమ హయాంలో 90 శాతం పూర్తయిన పనులను సైతం వైసీపీ ప్రభు త్వం పూర్తి చేయలేకపోయిందని, రాష్ట్రానికి వైసీపీ ప్రభుత్వం పదివేల కోట్ల అప్పులను మిగిల్చిపోయిందని తెలిపారు. ప్రజల చిన్నచిన్న సమస్యల పరిష్కారం కోసం గతంలో ఉన్న పురసేవను మనమిత్రగా మార్చి సేవలందిస్తున్నా మని, మన మిత్రలో సమస్యలను తెలియజేసిన వెంటనే అధికారులు స్పంచి పరిష్కారం చూపు తారని వివరించారు. తాను ఎన్నికల సమయం లో 94వేల ఇల్లు తిరిగానని, వారికి ఇచ్చిన హామీ ల మేరకు ప్రతి ఒక్కటి నెరవేరుస్తానని, నెల్లూ రును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. వీఆర్ హై స్కూల్‌ను తిరిగి పునరుద్ధరించి అత్యంత నిరుపేదలకు నాణ్యమైన ఉచిత విద్యనందిస్తామని చెప్పారు. కాలువ కట్టల మీద బీడీలు, చుట్టలు చుట్టుకునే వారిని, తల్లిదండ్రులు లేని పిల్లలను, పాచి పను లు చేసుకునే నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలను గుర్తించాలని సచివాలయ కార్యదర్శి లను ఆదేశించడం జరిగిందన్నారు. హై స్కూల్లో వారికి ఉచిత విద్యతోపాటు నాణ్యమైన భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు ఈవిద్యా సంవత్సరంకి స్కూలు ఆధునికరణ పనులు పూర్తవుతాయని మంత్రి ఈ సందర్భంగా తెలియ జేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమి షనర్ నందన్ డిప్యూటీ మేయర్ తహసీన్, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ తాళ్లపాక అనురాధ, టిడిపి సీనియర్ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, పలువురు కార్పొ రేటర్లు టిడిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# బంగారుచోరీ నిందితులు అరెస్ట్

- 7లక్షలవిలువైన ఆభరణాల స్వాధీనం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో బంగారునగల చోరీకిపాల్పడిన నిందితులను అరెస్ట్ చేశామని, వారినుండి 7లక్షలరూపాయల విలువగల ఆభరణాలను స్వాదీనం చేసుకున్నామని స్థానిక డిఎస్‌పి కె.వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను తెలిపారు. మార్చి 31వ తేదీ రాత్రి 8గంటల సమయంలో ఆత్మకూరు పట్టణంలోని మెయిన్‌రోడ్డుపై చేజర్ల రమణమూర్తి బంగారునగల దుకాణం మూసివేసే సమయంలో బంగారు, వెండినగల సంచిని తలుపు పక్కన ఉంచగా మోటర్‌సైకిళ్ళపై వచ్చిన దుండగులు ఆ సంచిని తీసుకొని ఉడాయించారు. కేసునమోదు దర్యాప్తు జరిపామని, సిసికెమెరాల పుటేజిల ఆధారంగా నింధితులను పసిగట్లామని, శనివారం బి.చిరువెళ్ళ వద్ద అనుమాన్పాదంగా సంచరిస్తున్న నిందితులను అదుపు లోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించారని, వారినుండి ఆభరణాలను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశామన్నారు. నిందితులు బొంతు ముంగయ్య (గుడివాడ), ఓటేరి సాయి(పల్నాడు జిల్లా అచ్చంపేట) లను అరెస్ట్ చేయగా రుద్ర అనే నిందితుడు పరారిలో ఉన్నాడని ఆయన తెలిపారు. వారి నుండి 7లక్షల రూపాయల విలువగల బంగారు, వెండి నగలను స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టులో హాజరుపరుచ నున్నామని డిఎస్‌పి వేణుగోపాల్ వెల్లడించారు. ఈ సమావేశంలో స్తానిక సిఐ జి.గంగాధర్, ఎస్‌ఐలు షేక్ జిలాని, ఎస్.సాయిప్రసాద్, కె.శ్రీని వాసులురెడ్డి, ఏఎస్‌ఐ కె.గిరిధరరావు, పిసిలు చెన్నకేశవులు, శ్రీనివాసులురెడ్డి, విజయ్, సతీష్, షరీఫ్‌బేగ్, ఆలీ, అశోక్‌కుమార్‌లు పాల్గొన్నారు. వీరంతా కేసును దర్యాప్తుజరిపి నిందితుల ఆచూకి సాధించినందుకు అభినందిస్తున్నామని డిఎస్‌పి వేణుగోపాల్ పేర్కొన్నారు.

# జిల్లాలో టెన్త్ విద్యార్థులు 80.1శాతం ఉత్తీర్ణత


- మరింతగా పెంచేందుకు కృషి
- హాస్టల్ భవనాలమరమ్మత్తులకు 9.64కోట్లు
- జిల్లా డిప్యుటిడైరెక్టర్ శోభారాణి




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ సాంఘికసంక్షేమ హాస్టల్స్‌లో ఉంటూ పదవితరగతి అభ్యశించిన విద్యార్థులు ఈ దపా 80.1శాతం మంది ఉత్తీర్ణలయ్యారని, ఈఫలితాలు ఎంతో సంతృపికరం గా ఉన్నానయని, రానున్న విద్యాసంవత్సరంలో మరింగా ప్రతేకవిధానాలు అమలుచేసి ఇంకా ఉత్తమ ఫలితాలు సాధిస్తామని జిల్లా సాంఘికసంక్షేమ డిప్యుటిడైరెక్టర్ కె.శోభారాణి పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరులోని ప్రభుత్వ కాలేజి బాలుర వసతిగృహంలో ఆత్మకూరు సహాయసాంఘిక సంక్షేమాధికారి కె.బ్రాహ్మనందాచారి ఆధ్వర్యంలో ఆత్మకూరు, పొదల కూరు ఏఎస్‌డబ్ల్యుఓల పరిధిలోని ప్రభుత్వ హాస్టళ్ళ టెన్త్ విద్యార్థులతో ప్రత్యేక అభినందన కార్యక్రమం ఏర్పాటు చేయగా ముఖ్యఅతిధిగా శోభా రాణి పాల్గొన్నారు. ఈసందర్భంగా అధికామార్కులు సాధించి ప్రతిభ చూపిన హాస్టల్ విద్యార్థులను ఆమె అభినందించి వారికి వెంగంపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మస్తానయ్య విరాళంగా అందజేసిన నగదు పారితోషికాలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె ప్రసంగిస్తూ వసతి గృహ సంక్షేమాధికారులు టెన్త్ ఫలితాల్లో 80.1శాతం సాధించి నందుకు అభినందించారు. రానున్న సంవత్సరంలో మరింతగా కృషచేసి ఫలితాల శాతం గణనీయంగా పెంచాలని సూచించారు. టెన్త్, ఇంటర్ విద్యార్థుల్లో మెరుగైన, సాధారణమైన, తక్కువ స్థాయిలో ఉన్న విద్యార్థు లను వర్గీకరించుకెఓవాలని, ఆస్థాయిలను బట్టి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని శోభారాణి సూచించారు. అలాంటి ప్రయత్నం చేస్తే తప్ప కుండా ఇంకా మంచి ఫలితాలు సాధ్యమవుతాని ఆమె అభిప్రాయపడ్డారు.

# మహిళలు వ్యాపారస్తులుగా రాణించాలన్నదే సీఎం సంకల్పం

## మంత్రి పొంగూరు నారాయణ




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా నెల్లూరులో స్మార్ట్ స్ట్రీట్‌ను ప్రారంభించనున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రాం కింద స్మార్ట్ స్ట్రీట్ వెండార్స్‌కు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు సభలో మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలు సాధారణంగా చేసే చిన్న చిన్న వృత్తులు కాకుండా పెద్ద పెద్ద వ్యాపారాలు చేసే స్థాయికి ఎదగాలనేదే తన అభిమతమన్నారు. వ్యాపారం విజయవంతంగా నిర్వహించాలంటే కంప్యూటర్‌పై కనీస అవగాహన ఉండాలన్నారు. అందుకు అవసరమైతే నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ ఇస్తామని మంత్రి తెలిపారు. అదేవిధంగా మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుంటుందని సీఎం నమ్మకమన్నారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు డ్వాక్రా, మెప్మా మహిళలకు 2500కోట్ల విలువ చేసే ఇసుక వ్యాపారాన్ని అందించమని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు నెల్లూరు నగరంలోని నిరుపేదలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతానని, వెయ్యి మందితో దుకాణాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో భాగంగా మొదటి దశలో 163 మంది వీధి వ్యాపారులను ఎంపిక చేసి వారితో దేశంలో ఎక్కడాలేనివిధంగా స్మార్ట్ బజార్లను నిర్వహింప చేస్తున్నామన్నారు. వ్యాపారస్తుల కోసం అవసరమైన సబ్సిడీలు, రుణాలు, సోలార్ పవర్ అందజేయడమే కాకుండా వారికి వ్యాపారంలో మెళకువలు తెలియజెప్పేందుకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం అందించామన్నారు. భవిష్యత్తులో మరింత పెద్ద వ్యాపారాలు చేయాలనే దృఢ సంకల్పం కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఎంపిక చేసిన 163 మందికి బ్యాచ్‌ల వారీగా నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్‌లో ప్రాథమిక శిక్షణ సైతం అందిస్తామన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లో మనమిత్ర యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలనీ, దాని ద్వారా ప్రభుత్వ సేవలను పొందటమే కాకుండా మున్సిపాలిటీలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను సైతం యాప్ ద్వారా అధికారులకు తెలియజేయుచున్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, మెప్మా పీడీ రాధమ్మ, మెప్మా అడిషనల్ మిషన్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, స్టేట్ మిషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, సుధీర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# వైస్ చైర్మన్ లేని నుడా !




**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీకి ఇంతవరకు వైస్ చైర్మన్ ను నియమించకపోవడం గమనార్హం. నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీకి నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ గా ఉన్న మల్లవరపు సూర్య తేజను ఇన్చార్జి వైస్ చైర్మన్‌గా నియమించారు. ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. అయితే ఇప్పటివరకు నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ పోస్ట్‌ను ఇన్చార్జితో కూడా భర్తీ చేయకపోవడం విశేషం. దీంతో ఇక్కడ పరిపాలన బాగా కుంటుపడిందని పలువురు చర్చించుకుంటున్నారు. నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీకి వైస్ చైర్మన్ ఉండవలసి ఉండగా ఇక్కడ కనీసం ఇంతవరకు ఎవరికీ ఇంచార్జి బాధ్యతలు కూడా అప్పగించలేదు. నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా ఉన్న సూర్య తేజ బదిలీ కావడంతో ఆ స్థానంలో జాయింట్ కలెక్టర్ ను నియమిస్తారని నుడా లో కొందరు అధికారులు అనుకున్నారు. అయితే నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ పోస్టు భర్తీ చేయవలసి ఉన్నప్పటికీ ఆ పోస్ట్ పై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కూడా ఇంతవరకు దృష్టి పెట్టకపోవడం విశేషం. నగరాభివృద్ధికి ఎంతో కీలకమైన ఈ పోస్టు పై ఇంతవరకు అధికారులు స్పందించకపోవడం విశేషం. ఇకనైనా నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ పోస్ట్ భర్తీ చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## భగవద్రామానుజాచార్యుల అవతారోత్సవాలు



**నెల్లూరు కల్చర్, మేజర్‌న్యూస్ :** శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానం, రంగనాయకులపేట, నెల్లూరు నందు శనివారం శ్రీ భగవద్రామానుజాచార్యుల 1008వ అవతారోత్సవాలు సందర్భంగా ఉదయం తిరుమంజనం జరిగింది. సాయంత్రం మంగళశాసనోత్సవం తదుపరి పేట ఉత్సవం అత్యంత వైభవరా జరిగింది. ఉభయకర్తలుగా.. చుండూరు వారి వనంతోపు నిర్దిష్ట ధర్మదాయం' వ్యవహరించారు. ఈ కార్యక్రమంకు ఆలయ ఈఓ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి, దేవస్థాన సిబ్బంది, అర్చకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా ఆశ్రిత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ముంగమూరు ఆశ్రిత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం నెల్లూరు నగర పార్టీ కార్యాలయంలో విద్యార్థి నాయకులు ఘనంగా నిర్వహించారు. నగర పార్టీ ఇన్‌చార్జ్ ఎంఎల్‌సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ ఏఎంసీ చైర్మన్ కోటేశ్వర రెడ్డి, కార్పొరేటర్లు ఊటుకూరు నాగార్జున, నీలి రాఘవ, ఇతర నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు చంద్ర, ఉమర్, శరత్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నగరంలోని 39 డివిజన్‌లో వైస్సార్సీపీ విద్యార్థి విభాగం నేత తౌఫిక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శనివారం ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం పలువురు స్థానికులకు చంద్రశేఖర్ రెడ్డి స్వయంగా మజ్జిగ అందజేశారు. చలివేంద్రం ఏర్పాటు ఆలోచన చేసిన తౌఫిక్‌ను చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల దాహార్తి తీర్చేందుకు ఎక్కడికక్కడ వైసిపి నేతలు ముందుకొచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. అందులో భాగంగా శనివారం 39వ డివిజన్లో స్థానిక విద్యార్థి విభాగం నేత తౌఫిక్ ముందుకొచ్చి చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకర మన్నారు. ప్రజాసేవ చేయడంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లప్పుడు ముందుంటారని తెలిపారు.

### వైభవంగా గంగమ్మ తల్లి ..

## మండల పూజా మహోత్సవాలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధి లోని గండిపాలెం పొన్నబోయిన చెంచు రామయ్య రిజర్వాయర్ సమీపంలో నూత నంగా నిర్మించిన శ్రీ గంగమ్మ తల్లి ఆల యంలో మండల పూజ మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన ఇంటి ఆడపడు చులు జమ్మి మోహన్ దగ్గర నైవేద్య కార్య క్రమం, గుడిలో సాంప్రదాయ బద్ధంగా పాలేటి గంగ పూజారిలచే ప్రత్యేక ప్రార్థన లు పూజలు, మధ్యాహ్నం పాముల సుబ్బరాయుడు దంపతులచే అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 4గంటలకు పాలేటి గంగ దేవత పూజార్లసే గావుగట్టు కార్యక్రమం, తదనంతరం సాయంత్రం జమ్మి చెట్టు వద్ద ఆడపడుచు ప్రత్యేక పూజలు పొంగల్లు నైవేద్య కార్యక్రమం, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామస్తులు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అర్చకులచే ప్రత్యేకంగా పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్ని కార్యక్రమాలు విజయవంతం అయ్యేందుకు ఆలయ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో విజయవంతం చేశారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు వేగవంతం చేయండి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నగరంలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల పనులను వేగంతో చేయాలని పబ్లిక్ హెల్త్ అధికారులకు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సూచించారు. శనివారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులు, ఇంజినీర్లు ప్రజారోగ్య శాఖ ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ కనెక్షన్‌ల పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అవసరమైతే సిబ్బందిని పెంచి పనులు వేగంగా చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పార్కులు, పాఠశాలల్లో పనుల పురోగతిపై వివరాలు అడిగితెలుసుకున్నారు. పదిహేను రోజుల్లో పనులు పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు. టిడ్కో ఇళ్ళ పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు. 27312 ఇళ్లకు గాను 17500 ఇళ్ళు పూర్తి చేసినట్టు తెలిపిన అధికారులు తెలిపారు. అందులో ఇప్పటికే 12000 మంది లబ్ధిదారులకు తాళాలు ఇచ్చినట్టు వెల్లడించారు. వారిలో 9549 మంది నివాసం ఉన్నారని పేర్కొన్నారు. మరో 5500 టిడ్కో ఇళ్ళు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. 9700 ఇళ్ళు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. డబ్బులు కట్టి ఇళ్ళు ఇవ్వని వారి జాబితా సిద్ధం చేయాలని అధికారులను కోరారు. జూన్ 15 కల్లా మిగిలిన ఇళ్ళ పనులు పూర్తి చేయాలని సూచించారు.